

'మధుకాన్' కార్మిక సమస్యలు పరిష్కరించాలి

ఎచ్చెర్ల : మధుకాన్ గ్రానైట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. మధుకాన్ గ్రానైట్ కార్మికులకు రెండు సంవత్సరాల పెండింగ్ బోనస్ చెల్లించాలని, వేతనాలు పెంచాలని, కార్మికులందరికీ పిఎఫ్ అమలు చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో ఎచ్చెర్ల మండలం కొంగరాం గ్రామం వద్ద గల మధుకాన్ గ్రానైట్ క్వారీ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరలకనుగుణంగా వేతనాలు పెంచాలని గత రెండు సంవత్సరాలుగా కోరుతున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదని అన్నారు. కార్మికులందరికీ పిఎఫ్ అమలు చేయాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంటనే యూనియన్‌తో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలన్నారు.

కార్యక్రమంలో గ్రానైట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మందకొడిగా 'మడ్డువలస' పనులు

- జనవరిలో పూర్తి చేసేలా ఒప్పందం
- ఐదు నెలలే మిగిలి ఉంది
- అసంపూర్తిగా కాలువ పనులు
- సకాలంలో పూర్తి కావడంపై సందేహాలు

మడ్డువలస రెండో దశ పనులు మందకొడిగా సాగుతున్నాయి. గతంలో ప్రారంభించి ఆపేసిన తర్వాత ఇంకా 22 శాతం పనులే మిగిలాయి. మిగిలిన పనులను ప్రభుత్వం కొత్త నిర్మాణ సంస్థకు పనులు అప్పగించింది. ఈ ఏడాది ఏప్రిల్ 24న మడ్డువలస పున:ప్రారంభ పనులకు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. ప్రాజెక్టు పనులు 2009లో ప్రారంభమై 2020 జూలై వరకు సాగాయి. కొత్త ఒప్పందం ప్రకారం వచ్చే ఏడాది జనవరిలోగా పనులు పూర్తి చేయాల్సి ఉంది. ప్రస్తుతం జరిగిన పనులు పరిశీలిస్తే నిర్దిష్ట సమయానికి పూర్తి కావడంపై అనేక సందేహాలు నెలకొన్నాయి. కాలువ తవ్వకాల్లో అవరోధాలు, పనులకు అనుమతుల మంజూరులో జాప్యం వంటి అంశాలు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. పనులను సకాలంలో పూర్తి చేసి నీరందించేలా కార్యాచరణ అమలు చేస్తున్నామని చెప్తున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



లావేరు మండలం కొత్తకొంకాం వద్ద తవ్వి వదిలేసిన కాలువలు

మడ్డువలస జలాశయ రెండో దశ పథకాన్ని నిర్మించాలని 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. జనవరి 6, 2009లో రూ.57.87 కోట్లకు పరిపాలనా ఆమోదం కూడా తెలిపింది. జి.సిగడాం, పొందూరు, లావేరు, ఎచ్చెర్ల, మండలాల్లోని 24,954 ఎకరాలకు సాగునీందించాలన్నది ఈ పథకం ప్రధాన ఉద్దేశం. దీంతో మొత్తం 21 గ్రామాలకు తాగునీరు అందించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. పథకం నిర్మాణ బాధ్యతలను విశాఖపట్నానికి చెందిన పి.జె.ఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ టెండర్లలో రూ.47.3933 కోట్లకు దక్కించుకుంది. మార్చి 2, 2009న ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందం ప్రకారం పనిని 24 నెలల కాలంలో పూర్తి చేయాల్సి ఉంది. అంటే మార్చి 2, 2011 నాటికే పనులు పూర్తయి రైతులకు సాగు నీరందించాల్సి ఉంది. ఒప్పంద కాలపరిమితులు పొడిగిస్తూ ప్రభుత్వం వరుసగా ఆరు పర్యాయాలు అవకాశం ఇచ్చింది. చివరిసారిగా కాలపరిమితిని జూన్ 30, 2018 వరకు పొడిగించింది. అధికారిక లెక్కల ప్రకారం 78.36 శాతం పనులు పూర్తయ్యాయి. మరో 21.64 శాతం పనులు మిగిలి ఉన్నాయి. ఒప్పందం విలువ రూ.47.393 కోట్లలో రూ.37.14 కోట్లు ఖర్చు చేశారు. ప్రస్తుతం సంబంధిత నిర్మాణ సంస్థ పనులు నిలుపుదల చేసింది. దీంతో ప్రభుత్వం జూలై 8, 2020లో సంబంధిత నిర్మాణ సంస్థతో ఒప్పందాన్ని ముగించింది.

కొత్త నిర్మాణ సంస్థకు పనులు అప్పగింత

రిజర్వాయర్ పనులు చేపట్టిన పిజెఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ఇప్పటివరకు 78.36 శాతం మేర పనులు పూర్తి చేసి వైదొలగింది. మిగిలిన 21.64 శాతం పనులు చేసేందుకు కొత్త నిర్మాణ సంస్థకు పనులు పనులు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాలతో ఇంజినీరింగ్ అధికారులు మిగిలిన పనులకు కొత్త రేట్లకు అనుగుణంగా అంచనాలను రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. ప్రభుత్వం వాటికి ఆమోదం తెలిపి రూ.26.90 కోట్లను మంజూరు చేస్తూ 2022 ఏప్రిల్ 25వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. స్టేజ్-2లో అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను పూర్తి చేసేందుకు హైదరాబాద్‌కు చెందిన బిఎన్‌బి ఇన్‌ఫ్రా ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ రూ.23.83 కోట్లతో టెండర్లను దక్కించుకుంది.

పనులు వేగవంతానికి చర్యలు



మడ్డువలస జలాశయం స్టేజ్-2 పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. కాలువ తవ్వకాల్లో ఎచ్చెర్ల మండలంలోని పలు ప్రాంతాల్లో రాళ్లు ఉండడం, బ్లాస్ట్ చేయాల్సి రావడంతో కొంత జాప్యమైంది. లైనింగ్, బ్లాసింగ్ తదితర పనులకు సంబంధించి కాంట్రాక్టు నిర్మాణ సంస్థకు అనుమతులు రావడానికి కొంత సమయం పడుతుండడంతో పనులు కొంచెం నెమ్మదిగా సాగుతున్నాయి.

- పి.సుధాకరరావు, కార్యనిర్వాహక ఇంజినీర్, ప్రత్యేక కట్టడాల విభాగం



సమావేశంలో మాట్లాడుతున్న కళా వెంకటరావు

సెప్టెంబరులో కరెంట్ కోతలా?

- ప్రజలకు సమాధానం చెప్పాలి
- టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కళా వెంకటరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

సెప్టెంబర్‌లో కరెంట్ కోతలు ఏమిటని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళా వెంకటరావు అన్నారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో అన్ని ప్రాంతాల్లో మూడు నుంచి ఆరు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నారని చెప్పారు. ప్రజలకు కరెంట్ సరఫరా చేయడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని, దీనిపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కరెంట్ లేక జనం ఇబ్బందులు పడుతుంటే విద్యుత్ శాఖ మంత్రి గనుల తవ్వకాలు, టిడిపి నాయకులపై కేసులు నమోదు చేయించడంలో తీరిక లేకుండా ఉన్నారని విమర్శించారు. లోటు విద్యుత్ సమస్య అసలు ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. ప్రతి ఏడాది 12 నుంచి 18 శాతం డిమాండ్ పెరగుతుందని, అందుకనుగుణంగా ప్లానింగ్ చేయకపోవడం వల్లే ఈ దుస్థితి తలెత్తిందన్నారు. విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడం పరిశ్రమలు రావడం లేదని, ఆదాయం తగ్గి అభివృద్ధి కుంటుపడిందన్నారు. రాష్ట్రంలో 2014 వరకు 22 లక్షల మిలియన్ యూనిట్ల విద్యుత్ లోటు ఉండేదని, ఆరు నెలల్లోనే చంద్రబాబు లోటును అధిగమించి అంతరాయం లేకుండా కరెంట్ ఇచ్చేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత కరెంట్ ఛార్జీలను ఏడుసార్లు పెంచిన ప్రభుత్వం విద్యుత్‌ను మాత్రం సక్రమంగా పంపిణీ చేయడం లేదని విమర్శించారు. విద్యుత్ ఉత్పత్తి కోసం బ్యాంకుల నుంచి రూ.36 వేల కోట్లు, ఛార్జీల రూపంలో రూ.78 వేల కోట్లు వచ్చాయని రూ.లక్ష కోట్లను ప్రభుత్వం ఏం చేసిందో ప్రజలు తరుపున టిడిపి ప్రశ్నిస్తోందన్నారు. రాష్ట్రానికి జగన్మోహన్ రెడ్డి గ్రహణం పట్టిందని, వచ్చే ఎన్నికల్లో దాన్ని వదిలించుకోవాలన్నారు. సమావేశంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు పి.ఎం.జె బాబు, రాష్ట్ర ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్.వి రమణ మాదిగ, నాయకులు లంక శ్యామలరావు, బి.మల్లేశ్వరావు, చౌదరి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

5న అరసవల్లి హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఈనెల ఐదో తేదీన హుండీలను లెక్కించనున్నట్లు ఇఒ వి.హరి సూర్యప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని అనివెట్టి మండపంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి చంద్రశేఖర్, ఆలయ పాలకమండలి చైర్మన్ ఇప్పిలి జోగి సన్యాసిరావు, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలకమండలి సభ్యుల పర్యవేక్షణలో లెక్కింపు చేపడుతున్నట్లు తెలిపారు.

కరువు మండలంగా ప్రకటించాలి

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు



ఎండిపోయిన పంటను పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

వజ్రపుకొత్తూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని ఎపి రైతుసంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.బాలాజీరావు, టి.భాస్కరరావు, బి.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని నారాయణపురం, కూర్మనాథపురం, కొల్లిపాడు, కొండూరు, బొడ్డపాడు, సీతాపురం, బెండి తదితర గ్రామాల్లో పర్యటించి నీరు లేక ఎండిపోతున్న పంట పొలాలను పరిశీలించారు. నెల రోజులుగా వర్షాల్లేక, వంశధార కాలువ ద్వారా చివర భూములకు నీరందక పంటలు ఎండిపోతున్నాయని నాయకుల వద్ద రైతులు వాపోయారు. వంశధార ఎడమ కాలువ 60 ఆర్ఎల్ 5 ఎల్ బెండి కాలువలకు మరమ్మతులు చేయకపోవడంతో కాలువ మొత్తం గుర్రపుడెక్క, తూటికాడతో నిండిపోయిందని చెరుకుపల్లి వద్ద కాలవ గట్టు పూర్తిస్థాయిలో నిర్మాణం కాకపోవడం, మర్లపాడు రైల్వే ట్రాక్ వద్ద మట్టి పేరుకుపోవడంతో ఈ కాలువకు నీరు రావడం లేదన్నారు. కాలువ మరమ్మతు చేయాలని అధికారులకు అనేకసార్లు విన్నవించినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ మండలంలో వేలాది ఎకరాలు పంటలు నీరు లేక ఎండిపోతున్నాయని, అనేక గ్రామాల్లో నాట్లు కూడా వేయలేదన్నారు. వంశధార ఎడమ కాలువ ద్వారా 2,400 క్యూసెక్కుల నీరు విడిచిపెట్టాల్సి ఉన్నా వెయ్యి క్యూసెక్కులు కూడా విడిచిపెట్టడం లేదన్నారు. ఎడమ కాలువ నీటి సామర్ధ్యం పెంచకుండా కాలువపై 13 లిఫ్టులు ఏర్పాటు చేయడంతో దిగువకు నీరు రావడం లేదన్నారు. వెంటనే అధికారులు స్పందించి కాలువ మరమ్మతులు చేయాలని, ఈ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ, హేమంత్, ధర్మారావు, రామారావు, చిట్టిబాబు తదితరులున్నారు.

రెడ్‌క్రాస్ సేవలు మరింత విస్తృతం

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్


రాష్ట్రంలోనే ఉత్తమ సేవలు అందిస్తూ ప్రజల అవసరాలను తీర్చడంలో ముందున్న రెడ్‌క్రాస్ సంస్థ సేవలు ప్రజలకు మరింత విస్తృతం చేయాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయ ప్రాంగణంలో సంస్థ పరిపాలన, నైపుణ్యాభివృద్ధి భవన నిర్మాణానికి శనివారం భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇండియన్ రెడ్‌క్రాస్ ద్వారా అందుతున్న సేవలను కొనియాడారు. ఈ భవన నిర్మాణం వల్ల మరిన్ని సేవలను విస్తృతపరచడానికి దోహదపడుతుందన్నారు. ఈ భవన నిర్మాణం పూర్తయితే పలు శిక్షణా తరగతులను నిర్వహించుకునేందుకు వీలవుతుందన్నారు.

రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ మగటపల్లి వెంకటరమణమూర్తి వెల్ఫేర్ అండ్ సర్వీస్ సొసైటీ, సహకారంతో నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, వైస్ చైర్మన్ కె.సుధీర్, కోశాధికారి కె.దుర్గా శ్రీనివాస్, సభ్యులు ఎన్.అప్పన్న, నిక్కు హరి సత్యనారాయణ, పి.శ్రీకాంత్, నూక సన్యాసిరావు, ఎం.కళ్యాణ్ చక్రవర్తి, బి.చిన్మయరావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ, మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రుణ మంజూరులో ఇబ్బందులు పెట్టొద్దు

- రైతులు, కౌలు రైతులకు తోడ్పాటు అవసరం
- లక్ష్యాలను పూర్తి చేయాలి
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

రుణ మంజూరులో కొంతమంది బ్యాంకర్లు ఇబ్బందులు పెడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని రైతాంగానికి, మహిళలకు సకాలంలో రుణాలు మంజూరు చేసి ఆర్థిక సాధికారత సాధించేందుకు దోహదపడాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా రుణాలు ఇవ్వాలన్నారు. రైతులకు రుణాలు ఇవ్వడంలో కొన్ని బ్యాంకు శాఖల్లో అధికారులు సహకరించడం లేదన్నారు. దీనివల్ల సాగుకు రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని చెప్పారు. బ్యాంకుల వారీగా ఉన్న లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. సంబంధిత జిల్లా అధికారులు, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమలకు ఇచ్చిన రుణాల తిరిగి చెల్లింపులు, ఎంఎస్ఎంఇ లక్ష్యాలు జిల్లాలో తక్కువగా ఉందని, బ్యాంకులన్నీ లక్ష్యాలు పెంచాలన్నారు. సిసిఆర్‌సి కార్డులపై రుణాలు మంజూరుపై దృష్టిసారించాలన్నారు. జిల్లాలో ఎక్కువమంది కౌలు రైతులు ఉన్నారని, వారికి రుణాలు ఇవ్వడం ద్వారా సాగుకు ప్రోత్సహించవచ్చన్నారు. వ్యవసాయ రుణాలు బ్యాంకుల వారీగా జాబితా అందజేయాలని లీడ్ బ్యాంక్ మేనేజర్‌ను ఆదేశించారు.

డిఆర్‌డిఎ, మెప్మా, టిడ్కో, జగనన్న సంపూర్ణ గృహ హక్కు పత్రం రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లతో వచ్చిన వారికి రుణాలు మంజూరు చేయాలన్నారు. గృహ హక్కు పత్రాలు తీసుకున్న వారు రుణాలు పొందవచ్చని గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పత్రాలు పొందిన వారికి తెలియజేయాలని హౌసింగ్ పీడీని ఆదేశించారు. సమావేశంలో ఎల్‌డిఎం ఎం.సూర్యకిరణ్, ఎస్‌బిఐ రీజనల్ హెడ్ ఎం.వి తిలక్, నాబార్డు డిడిఎం కె.వరప్రసాద్, ఆర్‌బిఐ ఎజిఎం అనిల్, జిల్లా అధికారులు ఉమామహేశ్వరరావు, వరప్రసాద్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మోసం చేసింది ఎవరు సార్..!

- కలెక్టర్ వ్యాఖ్యలపై రైతుల అసహనం
- పూర్తిస్థాయిలో భూసేకరణ ఎక్కడ జరిగింది?
- డిఆర్ఒకి తొమ్మిది పేజీల వినతిపత్రం అందజేత

ప్రజాశక్తి - టెక్కలి



డిఆర్ఒకి వినతిపత్రం అందిస్తున్న రైతులు


మూలపేట పోర్టు నిమిత్తం టెక్కలి ఫ్లైఓవర్ జాతీయ రహదారి నుంచి మూలపేట వరకు నిర్మాణం తలపెట్టనున్న ప్రయివేట్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి భూసేకరణ విషయంలో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ చేసిన వ్యాఖ్యలపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని బన్నువాడ, మోదుగువలస, వేములాడ గ్రామాలకు చెందిన రైతులను ఒప్పించే ప్రక్రియలో 'మీరు మోసం చేస్తున్నారు' అని కలెక్టర్ వ్యాఖ్యానించారని రైతులు చెప్తున్నారు. ఈ మేరకు వాస్తవాలను వివరిస్తూ తొమ్మిది పేజీల లేఖని జిల్లా రెవెన్యూ అధికారి మురళీకృష్ణకు అందించారు. 2022 ఏప్రిల్‌లో నర్సిపురం, శాసనాం, బూరగాం గ్రామాల మీదుగా మూలపేట పోర్టుకి 45 మీటర్ల రోడ్డు నిర్మాణం చేపడతామని ప్రిలిమినరీ నోటీస్ జారీ చేశారని తెలిపారు. ఆ కాలపరిమితి పూర్తి కాకుండానే బన్నువాడ, మోదుగువలస, వేములాడ, తలగాం మీదుగా పోర్టుకి వంద మీటర్ల రోడ్డు నిర్మాణం చేపడతామని అదే ఏడాది అక్టోబరులో ఏ విధంగా మరో నోటిఫికేషన్ జారీ చేశారని ప్రశ్నించారు. 2022 అక్టోబర్‌లో జారీ చేసిన ప్రిలిమినరీ నోటిఫికేషన్ ఉంటుండగానే ఈ ఏడాది మార్చి 24న బన్నువాడలో గ్రామసభ ఏర్పాటు చేయడంలో ఆంతర్యమేమిటన్నారు. బాధిత గ్రామాల్లో డ్రాఫ్ట్ డిక్లరేషన్ ఎక్కడ అందుబాటులో ఉంచారో మీ అధికారులు సమాధానం చెప్పగలరా అని ప్రశ్నించారు. రీ సర్వే పేరిట కొలతలు వేయించి వివరాలు సేకరించడంలో ఔచిత్యమేమిటని లేఖలో పేర్కొన్నారు.

సేకరించిన భూముల వివరాలు ఇవి...

వేములాడకు చెందిన 65 మంది రైతుల నుంచి 26 ఎకరాలు సేకరించాల్సి ఉండగా 36 మంది రైతుల నుంచి కేవలం ఆరున్నర ఎకరాలు మాత్రమే సేకరించారని తెలిపారు. బన్నువాడ నుంచి 57 మంది రైతులకు చెందిన పదిహేడున్నర ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా, 12 మంది రైతుల నుంచి 1.65 సెంట్లు మాత్రమే సేకరించారని ఆ లేఖలో పొందుపరిచారు. మోదుగువలస నుంచి 86 మంది రైతుల నుంచి 25 ఎకరాలు సేకరించాల్సి ఉండగా, ఇంతవరకు సేకరణ జరగలేదని దుయ్యబట్టారు. వాస్తవాలు ఇలా ఉండగా రైతులందరూ పోర్టు రోడ్డు నిర్మాణానికి భూములు ఇచ్చారని నమ్మించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. బన్నువాడలో 80 ఏళ్ల వయసు కలిగి మానసిక స్థితి సక్రమంగా లేని వ్యక్తితోపాటు ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగాలు చేసుకుంటున్న ఆతని కొడుకులు వచ్చి సంతకాలు పెట్టించుకున్నట్లు చెప్తున్న మాటలు నమ్మశక్యంగా లేవన్నారు. ఇదే నిజమైతే తామంతా ఎటువంటి పరిహారం పుచ్చుకోకుండా తమ భూములను అప్పగిస్తామని, అబద్దమైతే బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటారా అని సవాల్ విసిరారు. మూలపేట పోర్టుకి ప్రయివేట్ రోడ్డు నిర్మాణం చేస్తే తమ ప్రాంతం వరద ముంపు బారిన పడుతుందని విన్నవిస్తే వంశధార శాఖ ఉన్నతస్థాయి అధికారులు చేపట్టిన సర్వే నివేదిక నేటివరకు ఎందుకు బహిర్గతం చేయలేదన్నారు. వేములాడలో సెంటు భూమి కూడా కోల్పోని సర్పంచ్ వాళ్ల మామయ్య అభిప్రాయాన్ని మిగిలిన రైతుల మీద రుద్దడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాన్నారు. మోదుగువలసలో సెంటు భూమి కూడా లేని బన్నువాడ సర్పంచ్ తమ భూములకి ధర ఎలా నిర్ణయిస్తారని ప్రశ్నించారు. రైతు పండించే పంటకన్నా పరిహారం రూపంలో వచ్చే ఆదాయం ఎక్కువని కలెక్టర్ చెప్పారని, జీవనాధారమే కోల్పోయాక ఎలా బతకాలని రైతులు మోదుగువలస గణపతిరావు, పోలాకి ఆనంద్, వట్టికూళ్ల రామకృష్ణ, మోదుగువలస కూర్మారావు, పోలాకి సుశీల, కర్రెమ్మ, సోమేశ్వరరావు ప్రశ్నించారు.

తరిగిన ఆదరణ... తరగని నిరాదరణ

సమయానికి ముందస్తుగానే ఎన్నికల వాతావరణం వచ్చేయడంతో, ఎన్నికల ప్రచారంలో పార్టీలు మునిగి తేలుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి 2019 నాటి ప్రజాదరణ నేడు కనిపించడం లేదన్నది వాస్తవం. నాటి ఆదరణ తరుగుతూ వస్తోంది. వైనాట్ 175 అన్న నినాదం రాజకీయ ప్రచారం గానే మిగిలిపోనుందని రాజకీయ పరిశీలకులు చెప్తున్నారు. జిల్లా వైసిపి ముఖ్య నేతలూ ఈ వాస్తవాలను అంగీకరిస్తున్నారు. వంద సీట్లతోనైనా మళ్లీ అధికారం తమదేనని విశ్వసిస్తున్నట్లు చెప్తున్నారు. ప్రజల ఎండకు సంక్షేమ పథకాల గొడుగు కాస్తుంది గానీ వర్షాలు, తుపాను వంటి పాలనా వైఫల్యాలకు సంక్షేమ పథకాల గొడుగు కాసే పరిస్థితి ఉండదని ఆ పార్టీ కీలక నేతలే తమ అనుయాయుల వద్ద చెప్తున్నారని తెలిసింది. ప్రజలపై ఒక్క జిల్లాలోనే నెలకు అదనంగా రూ.ఐదు కోట్ల భారం పడుతోంది. దీనికితోడు తాజాగా విద్యుత్ కోతలు మొదలయ్యాయి. ప్రభుత్వం ఈ వాస్తవాన్ని అంగీకరించలేక మింగలేక, కక్కలేక సతమతమవుతున్న పరిస్థితిని చూస్తున్నాం. ఏ వస్తువైనా, డబ్బులైనా అనుమతి లేకుండా తీసుకుంటే అది దొంగతనమే అవుతుంది. జగన్ ప్రభుత్వం అలాంటి దొంగతనానికి పాల్పడుతోంది. గ్రామ పంచాయతీలకు రావాల్సిన ఆర్థిక సంఘ నిధులను దొంగలించింది. అందులో జిల్లాకు రావాల్సినవి రూ.78 కోట్లు ఉన్నాయి. సర్పంచ్‌లు నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో, విద్యుత్ బిల్లుల పేరుతో ఆ నిధులను మినహాయించుకుంది తప్ప మిగిలిన సొమ్మును నేటికీ జమ చేయలేదు. రాష్ట్రంలో యూనివర్సిటీల నిర్వహణ అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులు రూ.500 కోట్లను ప్రభుత్వం దొంగతనం చేసింది. అందులో జిల్లాలోని అంబేద్కర్ విశ్వవిద్యాలయం వాటా రూ.32 కోట్లు ఉంది. ముఖ్యంగా ఉద్యోగులు, ఉద్యోగ విరమణ చేసిన వారి విషయంలో ప్రభుత్వం బాధ్యతారహితంగా వ్యవహరిస్తుందనే చెప్పాలి. కేవలం జిల్లాకు సంబంధించి పిఎఫ్, పిఆర్‌సి బకాయిలు, ఎపిజిఎల్ఐ బకాయిలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, సరెండర్ లీవులు తదితరవన్నీ జిల్లావరకు సంబంధించి ప్రభుత్వం రూ.440 కోట్లు బకాయి పడి ఉంది. అభివృద్ధి పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు సుమారు రూ.400 కోట్ల బకాయిలు ఉన్నాయి. అభివృద్ధి పనులు ఒక అడుగు ముందుకు, రెండడుగులు వెనక్కి అన్న చందమైంది. జిల్లాలో సుమారు 90 శాతం పనులు నిలిచిపోయాయి. జిల్లాకు వచ్చి ముఖ్యమంత్రి ప్రకటించిన నిధుల జాడ కనిపించడం లేదు. ప్రజా ఉద్యమాలపై నిర్బంధకాండ కొనసాగుతోంది. ధర్నాలకు న్యాయస్థానాల అనుమతి పొందాల్సిన దుస్థితి నెలకొంది. చాంతాడు వంటి వైఫల్యాల పుట్ట వల్లే నాటి ఆదరణ నేడు మంచులా కరిగిపోతుంది. అన్ని వర్గాల ప్రజల్లోనూ పలుస్థాయిలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రత్యామ్నాయం కనిపిస్తే జిల్లా ప్రజలూ అటువైపు వెళ్లిపోతారు. ఇలాంటి త ం ు ణ ం లో



తరిగిపోతున్న ఫ్యాన్ గాలి ప్రజాదరణను నిలువరించే ప్రయత్నం సాగితేనే జగన్ పాలనకు సార్థకత ఉంటుంది.

తరగని నిరాదరణ

జగన్ పాలనా వైఫల్యాలను చిత్తశుద్ధితో ప్రజల్లో ఎండగట్టే ప్రయత్నంలో వైఫల్యం కారణంగానే తరిగిన చంద్రబాబు ఆదరణ తిరిగి కూడగట్టే ప్రయత్నంలో విఫలమైనట్లు జిల్లాలోని టిడిపి రాజకీయాలు స్పష్టం చేస్తున్నాయి. కమలం నీడలో జగన్‌తో పాటు కార్పొరేట్ల పక్షాన చంద్రబాబు నిలవడమే అందుకు కారణమని జిల్లా టిడిపి నాయకులు గట్టిగా విశ్వసిస్తున్నారు. బాబు పాలనలో జిల్లాలో ఐదేళ్లలో ఆశించిన ప్రగతి కానరాలేదు. ప్రాజెక్టుల పనులు ముందకు సాగలేదు. శ్రీకాకుళంలో కూల్చేసిన స్టేడియాన్ని కట్టగలిగితే శ్రీకాకుళంలో టిడిపి గెలిచేదన్న ప్రచారం నాడు సాగింది. బాబు పాలనలో కొండంత ప్రచారం, పిడికెడంత ఆచరణ ఉండేదని ఆ పార్టీ నేతలే చెప్పే పరిస్థితి ఉంది. తొలి శాసనసభలో జిల్లాకు మంజూరు చేసిన పది ప్రాజెక్టుల్లో ఏ ఒక్కదానినైనా ఆయన శంకుస్థాపన చేసే పరిస్థితి రాలేదు. అందువల్లే ఆయన కొత్త హామీలను జిల్లా ప్రజలు విశ్వసించే పరిస్థితి కనిపించడం లేదు. ఇసుక మాఫియా గురించి జిల్లాలో అధికార, ప్రధాన ప్రతిపక్ష నాయకులు పరస్పర విమర్శలు చేసుకోవడం చూస్తున్నాం. కానీ రెండు పార్టీల పెద్దలు కలిసి ఇసుక వ్యాపారాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్న చరిత్ర చెరిపేస్తే చెరిగిపోదు. అందువల్ల రెండు పార్టీలు కలిసి ప్రజల కళ్లల్లో ఇసుక కొట్టి పాలన చేస్తున్న వైనాన్ని చూశాం, చూస్తున్నాం. జగన్ పాలనపై దుమ్మెత్తిపోస్తున్న చంద్రబాబు ప్రత్యామ్నాయం చూపడం లేదని జిల్లాలో ఆ పార్టీ నేతలే బహిరంగంగా చెప్తున్నారు. పొత్తులతో ముందుకెళ్తామని తాజాగా చంద్రబాబు ప్రకటించారు. బిజెపితో అయితే నష్టపోతామని జిల్లా నేతలు బహిరంగంగానే చెప్తున్నారు. రాష్ట్రానికి, జిల్లాకు జరిగిన అన్యాయం గురించి వారు గుర్తుచేసే పరిస్థితి ఉంది. పొత్తుల్లో భాగంగా తొలి దశలో 76 టిడిపి, 16 జనసేన అభ్యర్థులను ప్రకటించనున్నట్లు తెలిసింది. వాటిలో జిల్లాలో ఇచ్ఛాపురం అశోక్, పలాస శిరీష, టెక్కలి అచ్చెన్నాయుడు, ఆమదాలవలస రవికుమార్ పేర్లు ఉన్నట్లు ఇటీవల నిర్వహించిన పార్టీ సమావేశంలో స్పష్టత ఇచ్చినట్లు తెలిసింది. జనసేన ఎచ్చెర్లను కోరుతున్నందున మాజీ మంత్రి కళా వెంకట్రావును పార్లమెంట్ బరిలో దించాలన్న నిర్ణయమైందని ప్రచారం ఉంది. జిల్లాలో జనసేనకు సంబంధించి అంగ బలం, అర్థ బలమే కాకుండా రాజకీయంగా గుర్తింపు కలిగిన నేతలెవరూ కనిపించని పరిస్థితి ఉంది. ఇలాంటి సమయంలో తరగని నిరాదరణను తిరిగి ఆదరణ పొందేలా సైకిల్ ఎలా ముందుకు సాగుతుందో చూడాల్సి ఉంది.

- సత్తారు భాస్కరరావు



మాట్లాడుతున్న గొండు శంకర్

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

క్రీడలతో ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు గొండు శంకర్ తెలిపారు. మండలంలోని సానివాడలో జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ సంఘం ఆధ్వర్యాన ఆధ్వర్యాన జిల్లాస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు, రాష్ట్రస్థాయి జట్టు ఎంపికలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలతో శారీరిక మానసిక ఆరోగ్యం లభిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించడం ద్వారా నైపుణ్యమైన క్రీడాకారులు, మట్టిలో మాణిక్యాలు వెలుగులోకి వస్తారని అన్నారు. విద్యార్థుల తమ విలువైన సమయాన్ని వృథా చేయకుండా, అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి తమ తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, దేశానికి కీర్తి ప్రతిష్ట తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లా బాల్ బ్యాడ్మింటన్ ప్రధాన కార్యదర్శి పి.వి.జి.మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ జిల్లాలో బాల్ బ్యాడ్మింటన్‌కు త్వరలోనే పునర్ వైభవం తీసుకొస్తామని తెలిపారు. సీనియర్ క్రీడాకారుల విజయ పరంపరమైన కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఒలంపిక్ అసోసియేషన్ సలహాదారులు పెంకి సుందర రావు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వి. రమణ, ఎం.సాంబమూర్తి, ఎస్‌జిఎఫ్ సెక్రటరీ బి.వి.రమణ, సానివాడ సర్పంచ్ రుప్ప లక్ష్మి, గ్రామీణ మండలం బాల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షులు రుప్ప రమణమూర్తి, జిల్లా సంఘ ప్రతినిధులు పి.అజయ్ కుమార్, అరుణ్‌కుమార్, ఎం.మధుసూదనరావు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



'యువ మంతన్' నమూనాను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

విద్యార్థులు పర్యావరణ పరిరక్షకులు

పలాస : విద్యార్థులు పర్యావరణ పరిరక్షకులని ప్రధానోపాధ్యాయులు కోర్ల వైకుంఠరావు అన్నారు. మండలంలోని బ్రాహ్మణతర్లా హైస్కూల్‌లో జాతీయ హరిత దళ క్లబ్, జూనియర్ రెడ్‌క్రాస్ క్లబ్ ఆధ్వర్యాన విద్యార్థులు జి20 దేశాధినేతలుగా యువ మంతన్ నమూనా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ నెల 9,10 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించనున్న జి20 సదస్సు సందర్భంగా కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై చైతన్యం కలిగించేందుకు లైఫ్ స్టైల్ ఫర్ ఫ్యూచర్ ఎన్విరాన్మెంట్‌లో భాగంగా నమూనా జి20పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌జిసి ప్రాంతీయ సమన్వయకర్త శ్రీనివాసరావు, సిబ్బంది రమణారావు, ఈశ్వరరావు, మధుబాబు, రమేష్, సుధాకుమారి, పద్మ, యామిని, చంద్రశేఖర్, కిషోర్, రజని కుమారి, మెహర్ సుధ, జ్యోతమ్మ, అరుణకుమారి, చిన్నారావు, లక్ష్మీభాయ్, విష్ణాచారి, కృష్ణారావు పాల్గొన్నారు.

ప్రవేశాలకు సమయం పొడిగింపు

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం డిగ్రీలో ప్రవేశం పొందడానికి ఈ నెల 5 వరకు సమయం పొడిగించామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు విద్యార్థులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు మరో అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

జన హృదయ నేత వైఎస్ఆర్



ఆమదాలవలస : విగ్రహానికి పూలమాలలు వేస్తున్న స్పీకర్ సీతారాం



కవిటి : విగ్రహానికి పూలమాలలు వేస్తున్న విజయ, రామారావు

ప్రజాశక్తి- విలేకరుల యంత్రాంగం

సంక్షేమ పథకాలకు ఆద్యుడు మాజీ సిఎం వై.ఎస్ రాజశేఖరరెడ్డి అని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. వైఎస్ఆర్ 14వ వర్థంతి సందర్భంగా ఆమదాలవలస పట్టణంలోని ఫ్లైఓవర్ దిగువన ఉన్న ఆయన విగ్రహానికి శనివారం పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ఐదేళ్ల మూడు నెలలు పరిపాలించి తెలుగు రాష్ట్రాల ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా స్థానం సంపాదించుకున్నారన్నారు. పేదవాడి జీవితాల్లో వెలుగులు నింపిన వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది వైఎస్ఆర్ అని అన్నారు. కార్యక్రమంలో యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, డిసిసిబి డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, బగాది నారాయణమూర్తి, మున్సిపల్ మాజీ వైస్ ఫ్లోర్ లీడర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, మండల సచివాలయ కన్వీనర్ బొడ్డేపల్లి నిరంజన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస పట్టణంలోని ఫ్లైఓవర్ వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి వైసిపి నాయకులు సువ్వారి గాంధీ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ముందుగా లయన్స్ క్లబ్, బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు నటుకుల మోహన్, పొన్నాడ రవికుమార్, బాడాన దేవభూషణ్‌తో కలిసి గాంధీ వైద్య శిబిరం నిర్వహించారు. 50 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. అలాగే వెయ్యి మందికి అన్నదానం చేశారు. కార్యక్రమలో వైసిపి నాయకుడు సువ్వారి సత్యనారాయణ (ఢిల్లీ), సువ్వారి అనీల్ కుమార్, పేడాడ వైకుంఠరావు, పొందూరు సర్పంచ్ రేగిడి లక్ష్మి, చేనేత విభాగం అధ్యక్షులు కోరుకొండ సాయికుమార్, జి.కె.వలస సర్పంచ్ ఫంగ సతీష్, రాపాక మాజీ ఎంపిటిసి పోతురాజు సూర్యారావు పాల్గొన్నారు.

కవిటి స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి కడియాల పద్మ, ప్రకాష్, ఎఎంసి వైస్ చైర్మన్ ఎలమంచి నీలయ్య, వైస్ ఎంపిపి కర్రి గోపయ్య, కో-ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్ పాల్గొన్నారు.

శ్రీకాకుళం నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి వైద్యులు డాక్టర్ దానేటి శ్రీధర్, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం ప్రభుత్వాస్పత్రిలోని రోగులకు వైఎస్ఆర్ వర్థంతి సందర్భంగా జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ పళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామరావు, సీడాప్ ఎపి చైర్మన్ సాడి శ్యాం ప్రసాదరెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్కలోకేశ్వరరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పడ నారాయణమ్మ పాల్గొన్నారు.

టెక్కలి ఇందిరాగాంధీ కూడలి వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ పూలమాలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా విభాగం అధ్యక్షులు చింతాడ మంజు, గణపతి, సర్పంచ్ గొండెలి సుజాత, ఎంపిటిసి పీత హేమలతపాల్గొన్నారు.

టెక్కలిలోని వైఎస్ఆర్ విగ్రహానికి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం టెక్కలి పంచాయతీ పారిశుధ్య కార్మికులకు 25 కేజీల బియ్యం ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి అట్లా సరోజనమ్మ పాల్గొన్నారు.

రణస్థలంలోని వైఎస్ఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జడ్‌పిటిసి టొంపల సీతారాం, జెసిఎస్ ఇన్‌ఛార్జి చిల్ల వెంకటరెడ్డి, వైస్ ఎంపిపి రాయపురెడ్డి పాల్గొన్నారు.

కాశీబుగ్గ సంత మైదానంలోని వైఎస్ఆర్ విగ్రహానికి మత్స్య, పశుసంవర్థకశాక మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వైస్ చైర్మన్లు మీసాల సురేష్, బొర కృష్ణారావు, మున్సిపల్ మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ భవానీశంకర్, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, పట్టణ అధ్యక్షులు పైల చిట్టి పాల్గొన్నారు.

కొత్తూరులోని రెల్లివీధి వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే రెడ్డి శాంతి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైసిపి మండల పార్టీ అధ్యక్షులు సారిపల్లి ప్రసాదరావు, పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, సర్పంచ్‌లు కుంచాల రత్నాలు, పెదకోట సాధుబాబు, బాలకృష్ణ పాల్గొన్నారు.

సంతబొమ్మాళి మండలం నౌపడలో వైఎస్ఆర్ విగ్రహానికి జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, ఎంపిపి ప్రతినిధి మేరుగు అప్పారావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం వృద్ధులకు దస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కెళ్ల జగన్నాయకులు, వైసిపి మండల అధ్యక్షులు కోత సతీష్, నక్క భీమారావు, లోపింటి రాములు, నాగభూషణరావు పాల్గొన్నారు.

నందిగాం మండలం మర్లపాడులోని వైఎస్ఆర్ విగ్రహానికి కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి ఎన్.శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, సర్పంచ్‌లు బొమ్మాళి గున్నయ్య పాల్గొన్నారు.



పలాస : విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మంత్రి అప్పలరాజు



విగ్రహానికి పూలమాలలు వేస్తున్న సువ్వారి గాంధీ

మెళియాపుట్టి మండలం సవరబాణాపురంలో వైఎస్ఆర్ చిత్రపటానికి తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఎస్.ఆదినాయుడు, ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ అనపాన రాజశేఖరరెడ్డి, సర్పంచ్‌లు పెద్దింటి చంద్రావు, జనపరెడ్డి కన్నబాబు, సవర రంగారావు, సవర గౌరీస్ పాల్గొన్నారు.

పొందూరు అంబేద్కర్ కూడలిలో వైఎస్ఆర్ విగ్రహానికి వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిపి కిల్లి ఉషారాణి, పిఎసిఎస్ చైర్మన్ కొంచాడ రమణమూర్తి, నాయకులు కిల్లి నాగేశ్వరరావు, కిల్లాన సూర్యారావు, గాడు నాగారాజు, గూనాన కృష్ణ, పి.మోహన్, బొడ్డేపల్లి ప్రసాద్, గురుగుబెల్లి అసిరినాయుడు పాల్గొన్నారు.

జి.సిగడాం మండలంలోని సర్వేశ్వరం కూడలి వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి ఎంపిపి ప్రతినిధి మీసాల వెంకటరమణ, జెడ్‌పిటిసి కాయల రమణ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో జెఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, మండల వ్యవసాయ సలహా మండల చైర్మన్ మక్క వెంకట సాయి, సర్పంచ్ ప్రతినిధి చంద్ర సతీష్, ఎంపిటిసి రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కృపారాణి

దీర్ఘకాలిక వ్యాధులకు హోమియో మేలు

శ్రీకాకుళం అర్బన్ : హోమియో వైద్యం ద్వారా దీర్ఘకాలిక వ్యాధులను నయం చేయవచ్చుని, దీనివల్ల ఎటువంటి ఆరోగ్య సమస్యలు పునరావృతం కావని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి అన్నారు. మన హోమియో కేర్ ఆస్పత్రి శనివారం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఎస్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ సూర శ్రీనివాసరావుతో కలిసి పాల్గొన్నారు. తక్కువ ఖర్చుతో వ్యాధులు నమయం చేసుకునేందుకు హోమియో వైద్యం ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. భారతీయ వైద్య శాస్త్రానికి ప్రపంచంలోనే ప్రాచీన చరిత్ర ఉందని అన్నారు. అందులో హోమియో వైద్యం కూడా ఉందన్నారు. సంస్థ యాజమాన్యం తరపున డాక్టర్ పూజారి అన్నపూర్ణ, ఎస్.కె.ముస్తాక్, ఎండీ కర్రి రామ్మూర్తి పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి

ప్రజాశక్తి- విలేకరుల యంత్రాంగం

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, పెరిగిన నిత్యావసరాల ధరలు తోపాటు విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని కోరుతూ సోంపేట మండలం మామిడిపల్లి సచివాలయ ఉద్యోగులకు సిపిఎం నాయకులు వినతిపత్రం అందజేశారు.

గిరిజనులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని సిపిఎం జిల్లా నాయకులు నిమ్మక అప్పన్న డిమాండ్ చేశారు. సమరభేరిలో భాగంగా గొట్టిపల్లి సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సచివాలయ ఉద్యోగికి వినతిపత్రం అందజేశారు. శ్మశానవాటికకు, వీధి రోడ్లు నిర్మించాలని విన్నవించారు. కార్యక్రమంలో గేదెల గోవిందరావు, ఆరిక సావిత్రి, వెంకన్న, కె.కాంతమ్మ, పి.పార్వతి, ఎం.అప్పన్న, అమ్మన్నమ్మ, అరుద్రమ్మ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు మండలం పల్లిసారథి సచివాలయం వద్ద సమరభేరి కార్యక్రమంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.ఆనందరావు, బి.హేమంత్, సిహెచ్.కుమారస్వామి, కృష్ణవేణి, సుగుణావతి పాల్గొన్నారు. అనంతరం సచివాలయ ఉద్యోగికి వినతిపత్రం అందజేశారు.



సోంపేట : వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సమరభేరిలో భాగంగా ఈ నెల 4న చేపట్టనన్ను ఆందోళనను విజయవంతం చేయాలని ఎపి గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిన సాంబమూర్తి పిలుపునిస్తూ... పోస్టర్‌ను ఆవిష్కరించారు.



రికార్డులను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా

ఎంపిడిఒ కార్యాలయ సందర్శన

జి.సిగడాం : ఎంపిడిఒ కార్యక్రమంలో నిర్వహించిన పరిపాలనపై శిక్షణ కార్యక్రమాన్ని ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ విధులు, మండల అభివృద్ధి పై ఎంపిడిఒ కె.నిశ్చల ఆయనకు వివరించారు. ఈ మేరకు రికార్డులను పరిశీలించారు. సూపరింటెండెంట్ రామకృష్ణ, ఎన్ఆర్ఇజిఎస్ ఇసి గేదెల పురుషోత్తం, డిటి నిర్మల, కామేశ్వరరావు పాల్గొన్నారు.

అమరవీరుల గౌరవార్థం 'నా మట్టి నా దేశం'

రణస్థలం రూరల్ : అమరవీరులు గౌరవార్థం 'నా మట్టి నా దేశం' కార్యక్రమాన్ని చేపట్టామని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎచ్చెర్ల నియోజకవర్గం కన్వీనర్ నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఇఆర్) అన్నారు. శనివారం మండలంలోని బంటుపల్లి పంచాయతీలో ఇంటింటికీ తిరిగి చిటికెడు మట్టిని సేకరించారు. దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన వారిని గౌరవించుకునేందుకు ప్రధాని మోదీ కొత్త ప్రచారానికి శ్రీకారం చుట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎన్.రజని, బిజెపి జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్ష, కార్యదర్శులు టోంపల అప్పలరాజు, టోంపల రమేష్, ఎన్.చినబాబు, తిరుమరెడ్డి వెంకటేష్, అప్పలసత్యం ఉన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

మెళియాపుట్టి : మెళియాపుట్టి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గరికి గాయాలయ్యాయి. మండలంలోని మామిడిగుడ్డికి చెందిన జన్ని ధర్మారావు, జన్ని ప్రశాంత్, జన్ని యతేంద్ర బైక్‌పై మెళియాపుట్టి నుంచి టెక్కలి వైపు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురూ కింద పడిపోవడంతో గాయపడ్డాడు. వెంటనే స్థానికులు టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ టి.రాజేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రణస్థలం : మండలంలోని సీతంవలస సమీపంలోని రాజాం వెళ్లే రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రంగాయాలయ్యాయి. లావేరు మండలంలోని లావేటిపాళెంకు చెందిన లంకలపల్లి అదిబాబు రణస్థలం నుంచి తన స్వగ్రామం వస్తున్నాడు. వెనుక నుంచి లారీ వచ్చి ఢీకొనడంతో కాళ్లు, చేతులకు గాయలయ్యాయి.

శ్మశానవాటికలో మౌలిక వసతులు కల్పించాలి

కెవిపిఎస్ ఉపాధ్యక్షులు తిరుపతిరావు



శ్మశానవాటికను పరిశీలిస్తున్న కెవిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరపాలక సంస్థ పరిధిలోని అరసవల్లిలో ఉన్న శ్మశానవాటికలో మౌలిక వసతులు కల్పించాలని కెవిపిఎస్ నగర ఉపాధ్యక్షులు టి.తిరుపతిరావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. నగర పాలక సంస్థ పరిధిలోని అరసవల్లి శ్మశాన వాటికను శనివారం సందర్శించారు. సుమారు 250 దళిత కుటుంబాలు నివాస ముంటున్న ప్రాంతంలో దహన సంస్కారాలకు వీలుగా దశాబ్దాల క్రితం సుమారు 67 సెంట్లు స్థలం కేటాయించారని అన్నారు. కానీ ఇంతవరకు ఆ ప్రాంతంలో మౌలిక వసతులను సమకూర్చకుండా విడిచి పెట్టేశారని అన్నారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన జిఒ నంబరు 1235 ప్రకారం దళితులకు భూమి కేటాయించి, అభివృద్ధి చేయాలని చెపుతున్నా ఆ దిశగా అడుగులు పడడం లేదన్నారు. తక్షణమే జిఒ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్, కార్పొరేషన్ ప్రత్యేక నిధుల నుంచి కానీ, ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులు కేటాయించి విశ్రాంతి షెడ్, దహన సంస్కారాల షెడ్, తాగునీటి బోర్లు, ప్రహరీ నిర్మించాలన్నారు. కార్యక్రమంలో నగర కెవిపిఎస్ కమిటీ సభ్యులు ఎస్.ఎర్రయ్య, ఎ.అసిరినాయుడు, ఎ.రాంబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గౌతు శిరీష

నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యం

మందస: వైసిపి ప్రభుత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యమని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష విమర్శించారు. మండలంలోని హంసరాలి పంఆచయతీ మంధూరులో శనివారం రాత్రి మహాశక్తిలో భాగంగా బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీపై రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని అన్నారు. గిరిజన గ్రామాల్లో రోడ్లు, తాగునీటి సౌకర్యం టిడిపి హయాంలోనే చేపట్టారని పేర్కొన్నారు. సీతంపేటలోని ఐటిడిఎ పార్వతీపురం మన్యం జిల్లాకు వెళ్లిపోవడంతో గిరిజనులు తమ సమస్యలు చెప్పుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత జిల్లాలో ఐటిడిఎను ఏర్పాటు చేస్తామని హామీఇచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు భావన దుర్యోధన, వర్కింగ్ ప్రెసిడెంట్ రట్టి లింగరాజు, ప్రధాన కార్యదర్శి లబ్బ రుద్రయ్య, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు ముదుముంచి నవీన్ కుమార్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : రాష్ట్రాభివృద్ధి టిడిపితోనే సాధ్యమని జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి ఆసి లీలారాణి అన్నారు. పట్టణంలోని 22వ వార్డులో శనివారం మహాశక్తిపై అవగాహన కల్పిస్తూ.. శనివారం పోస్టర్లను అందజేశారు. కార్యరకమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు కాళ్ల ధర్మారావు, వార్డు కౌన్సిలర్ కాళ్ల దిలీప్, కొండా శంకర్, రెయ్యి జానికిరామ్, నందిగాం కోటి, కాళ్ల జైదేవ్, కొరాయి ధర్మ, కాళ్ల అర్జున్, సంతోష్, లోపింటి పద్మనాభం, దక్కత కామేష్, అన్నపూర్ణమ్మ, భాగ్యం పాల్గొన్నారు.

మురుగునీటి సమస్యను పరిష్కరించాలి

కొత్తూరు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న మురుగు నీటి సమస్య పరిస్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్ ప్రభుతాన్ని డిమాండు చేశారు. స్థానిక సచివాలయం-2లో అధికారులకు శనివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరు నెలల నుంచి మురుగు నీరు రహదారిపై ప్రవహిస్తున్నా... అధికారులు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మురుగునీరు రహదారిపై ప్రవహించడం వల్ల పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొటున్నరని ఆవేదన వ్యక్తం చేశారు. మురుగునీరు, వర్షపు నీరు నిల్వ ఉండడంతో దోమలు విజృభించి స్థానిక వాసులు రోగాలు బారిన పడుతున్నారన్నారు. దీంతో ఆర్థికంగా దెబ్బతింటున్నారని అన్నారు. వర్షపు నీరు, మురుగు నీరు వెళ్లేందుకు బ్రిటిష్ కాలం నాటి కల్వర్టును భూ ఆక్రమణదారులు మూసివేయడంతో ఈ పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు స్పందించి మురుగు నీటికి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. వైశ్యరాజు పైడిరాజు, బి.మహేష్, ఈపు సీతంనాయుడు, ఇప్పి సత్యనారాయణ, వాసు, ప్రమీలకుమారి, జయకుమారి, రమేష్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ప్రసాద్

రక్తం విలువ వెల కట్టలేనిది

మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సమాజంలో ప్రతి ఒక్కరికీ ఏదో ఒక సమయంలో రక్తం అవసరం ఉంటుందని, ఆ సమయంలో రక్తం విలువ వెలకట్టలేనిదని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పేర్కొన్నారు. తన జన్మదిన వేడుకల్లో భాగంగా లయన్స్ క్లబ్‌లో టిడిపి శ్రేణులు, నందమూరి అభిమానులు రక్తదానం శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. అంతకుముందు అభిమానుల సమక్షంలో కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. తల్లిదండ్రులపై బిడ్డ ప్రేమాభిమానాలకు అసలైన అర్థం ఈ రక్తదాన శిబిరమని, అందులో పాల్గొన్న ప్రతిఒక్కరికీ ఎంతగానో రుణపడి ఉంటానన్నారు. రక్తం ఇంకొకరికి ప్రాణదానం చేస్తుందని, అదే స్ఫూర్తితో తన జన్మదిన వేడుకలను నిర్వహించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. నందమూరి తారకరామా మోక్షజ్ఞ సేవా సంఘం అధ్యక్షులు మాదారపు డేవిడ్ ఆధ్వర్యాన 20 యూనిట్లు రక్తాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.ఎం.జె.బాబు, చిట్టి నాగభూషణం, చిట్టి మోహన్, మూకళ్ల సింహాద్రినాయుడు, శివప్రియ ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు రెడ్డి శివన్నారాయణ, రామ్‌గోపాల్, బాడాన దేవభూషణ, మణికంఠ పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న టిడిపి నాయకులు

ఆరోపణలు రుజువు చేయాలి

ప్రజాశక్తి- పలాస

జీడి కార్మికులపై ఇటీవల వచ్చిన దొంగతనం ఆరోపణలను జీడి ఉత్పత్తిదారుల సంఘం నాయకులు రుజువు చేయాలని లేకుంటే మానవహక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తామని కాష్యు లేబరు అసోసియేషన్ అధ్యక్షులు అంబటి ఆనందరావు, నెయ్యిల గణపతిలు కోరారు. మండలంలోని మంకినమ్మ ఆవరణలో కార్మికులతో శనివారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీడి వ్యాపారి పొట్నూరు బాలరాజు పరిశ్రమలో జీడిపప్పు దొంగతనానికి గురైందని, 18 మంది కార్మికులు దొంగతనం చేశారని ఆరోపిస్తున్నారని, వాటిని రుజువు చేయాలని డిమాండ్ చేశారు. జీడిపప్పు దొంగతనం వ్యవహారంలో 20 రోజుల నుంచి కార్మికులు పనికి దూరమై ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్య సున్నితమైందని అన్నారు. పరిశ్రమల పెద్దలు ఈ సమస్యను పరిష్కరించి కార్మికులకు న్యాయం చేసి పరిశ్రమలను వెంటనే తెరిపించాలని కోరారు. జీడి పరిశ్రమల బంద్ ప్రకటన చేసే ముందు పరిశ్రమశాఖాధికారుల ముందస్తు అనుమతులు తీసుకోవాలని, అలా చేయకుండా బంద్ చేయకుండా చట్టవిరుద్ధమని అన్నారు. సమావేశంలో లండ రమణ, కె.కోదండరావు, జి.నాగేశ్వరరావు, సిహెచ్.ఈశ్వరరావు, పి.అప్పలస్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆనందరావు

ఘనంగా పవన్ జన్మదిన వేడుకలు



ఆమదాలవలస : వైద్య శిబిరంలో పాల్గొన్న రోగులతో మోహనరావు

ప్రజాశక్తి- విలేకరుల యంత్రాంగ

టెక్కలిలో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్ కార్యాలయంలో కేక్ చేశారు. కూరాకుల యాదవ్ పేదలకు, భవన నిర్మాణ కార్మికులకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు.

పొందూరు పట్టణంలో జనసేన పార్టీ అధ్యక్షుడు, సినీనటుడు పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా పట్టణంలోని భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. అలాగే రెల్లి తరగతులతో కలిసి సహపంక్తి భోజనం చేసి వారికి చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు, తూర్పుకాపు జాతీయ అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు, మండల అధ్యక్షులు యలకల రమణ, కొంచాడ సూర్య, తోలాపి బాలకృష్ణ, కోరాడ రాజు, రామ్‌లక్ష్మణ్, జరజాపు గణేష్, లోట్ల మనోజ్, లోలుగు రఘు, సురేష్, బాలు పాల్గొన్నారు.

అలాగే మండలంలోని రాపాక కూడలిలో జనసైనికులు మోగా రక్తదాన శిబిరంను నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూ శ్రీకాకళం బ్లడ్ బ్యాంకు చేపట్టిన ఈ శిబిరంలో 30 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఆర్‌జెడి పాత్రుని పాపారావు, ఆలిండియా తూర్పుకాపు చైర్మన్ పిసిన చంద్రమోహన్, ఎంపిటిసి విక్రమ్ పాల్గొన్నారు.

ఆమదాలవలస మండలంలోని కొత్తవలసలో జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 300 మంది రోగులకు వైద్యాధికారులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జ్ పేడాడ రామ్మోహనరావు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పైడి ధనుంజయరావు, పొట్నూరు ప్రసాద్, పంచిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి మండలం పాలవలసకు చెందిన అంధులు గొంటి వెంకటరమణ, శారదలకు పవన్‌కళ్యాణ్ జన్మదిన సందర్భంగా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులకు రూ.13,500 అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పైడి మురళీమోహన్ పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాలకు మొక్కలను పంపిణీ చేశారు. అలాగే విద్యార్థులతో కలిసి మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.

జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పుట్టినరోజు పురస్కరించుకొని సోంపేట మండలం మామిడిపల్లి ఉన్నత పాఠశాల, రాజాం కస్తూరిబా పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు జనసైనికులు ప్రోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమంలో తోట కిరణ్, రెయి అరవింద్, మాజీ సర్పంచ్ జుత్తు సింహాచలం పాల్గొన్నారు.



పొందూరు: ప్రశంసాపత్రాలను అందజేస్తున్న నాయకులు

బూర్జ మండలంలోని కొల్లివలసలో జనసేన మండల పార్టీ అధ్యక్షులు నాగేంద్ర కొల్లివలస ఎంపిటిసి అంపిలి విక్రమ్, ఆముదాలవలస నియోజకవర్గ ఇన్‌ఛార్జి కె.మల్లేశ్వరరావు ఆధ్వర్యాన శ్రీకాకుళం పట్టణంలోని న్యూ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.

మండలంలోని మదనాపురంలో వైఎస్ఆర్ విగ్రహానికి జెడ్‌పిటిసి బి.రామారావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ మెంబరు జల్లు బలరాంనాయుడు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు కె.నాగేశ్వరరావు, పెద్దపేట ఉపసర్పంచ్ డి.ఎ.వి.నాయుడు, మాజీ సర్పంచ్ జల్లు అప్పలస్వామినాయుడు పాల్గొన్నారు.

శ్రీకాకుళం నగరంలోని పవన్ కళ్యాణ జన్మదినం సందర్భంగా ఎస్‌విసి థియేటర్‌లో తైక్వాండో శ్రీను కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అభిమాన సంఘం జిల్లా నేతలు గొర్లె కిరణ్, పి.కిరణ్‌రెడ్డి, బడే మోహన్, లింగాల హరీష్, గౌతమ్, సిద్ధు, పెయ్యల చంటి, జి.సాయివిజయ్, టి.శేఖర్, సిహెచ్.చరణ్, పుక్కల నవీన్, భాను పాల్గొన్నారు.

ఇచ్ఛాపురంలో పవన్ కళ్యాణ జన్మదిన సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. లాలోపేటలో కస్తూరిబా కళాశాలలో విద్యార్థుల మధ్య కేక్‌ను కట్ చేశారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు, పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.



ఇచ్ఛాపురం: దుస్తులను అందజేస్తున్న రాజు

పురుషోత్తపురంలో వంద మంది జనసేన పార్టీలో చేశారు. అలాగే కంచిలిల మండలం బెల్లుపడలో జనసేన జెండాను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు, జాయింట్ సెక్రటరీలు తిప్పన దుర్యోధనరెడ్డి, బైపల్లి ఈశ్వర్ పాల్గొన్నారు. అలాగే కవిటిలో జనసేన మత్స్యకార విభాగం రాష్ట్ర కార్యదర్శి నాలుగ హరిబెహరా భవన నిర్మాణ కార్మికులకు భోజనాలు ఏర్పాటు చేశారు.

మెళియాపుట్టిలోని వేణుగోపాలస్వామి ఆలయం ప్రాంగణంలో పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భంగా కార్యకర్తలు కేక్‌ను కట్ చేశారు. అనంతరం టీస్టాల్ ప్రారంభించారు. హీరాపురంలో ప్రయాణికుల సౌకర్యాం సిమెంట్ బెంచీలను ప్రారంభించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి గేదెల చైతన్య, దుక్క బాలరాజు, చింతల ప్రశాంత్, పిట్ట హరికృష్ణ, చంటి, కిరణ్ పాల్గొన్నారు.



మెళియాపుట్టి : కేక్‌ను కట్ చేస్తున్న చైతన్య

వంటగ్యాస్ ధర తగ్గింపు డ్రామా

ప్రజాశక్తి - ఆమదాలవలస

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇటీవల వంట గ్యాస్‌పై రూ.200 తగ్గించడం వాత పెట్టి వెన్న పూసినట్లుగా ఉందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బిసి సెల్ రాష్ట్ర కన్వీనర్ సనపల అన్నాజీరావు విమర్శించారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజల నుంచి కొన్నేళ్లుగా పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, నిత్యావసర సరుకులపై విపరీతంగా దోచుకుని చివరలో రూ.200 తగ్గించినట్లు ప్రజలను మభ్యపెడుతోందని ధ్వజమెత్తారు. మణిపూర్ ఘటనపై మోడీ దిష్టిబొమ్మలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. 90 రోజుల వరకు మణిపూర్ ఘటనపై స్పందించని ప్రధాని మోడీ ఆ తరువాత పార్లమెంట్‌లో మొసలికన్నీరు కార్చారని దుయ్యబట్టారు.

కవులకు జాతీయ సాహిత్య పురస్కారాలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణానికి చెందిన వచన కవి కుప్పిలి వెంకటరాజారావు, పద్యకవి కర్నేన జనార్ధనరావులు జాతీయ స్థాయి సాహిత్య పురస్కారాలకు ఎంపికయ్యారు. కరీంనగర్‌కి చెందిన ఆర్యాణి సకల కళా వేదిక, గౌతమేశ్వర సాహితీ కళా సంస్థలు సంయుక్తంగా ఆగస్టు 27న నిర్వహించిన 'ఒక గంటలో రెండు కవితలు' పోటీ నిమిత్తం అప్పటికప్పుడు రెండు అంశాలు ఇచ్చి కవితలు రచించిమనే పోటీ నిర్వహించింది. దేశ వ్యాప్తంగా ఈ పోటీలో 50 మంది కవులు పాల్గొన్నారు. ఈ పోటీలో కె.వి.రాజారావు, కె.జనార్ధనరావులు ప్రతిభను ప్రదర్శించారు. వీరికి సెప్టెంబరు 10న కరీంనగర్, ఫిల్మ్ నగర్ వేదికపై రికార్డు ధ్రువపత్రం, బంగారు పతకంతో సంస్థ అధ్యక్షుడు దూడపాక శ్రీధర్ చేతుల మీదుగా సన్మానించనున్నట్లు తెలిపారు..



ఆర్థికసాయం అందిస్తున్న గ్రామస్తులు

కేన్సర్ బాధితునికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- కవిటి

గొంతు కేన్సర్‌తో బాధపడుతున్న కవిటికి చెందిన పొల్లాయి మండల లక్ష్మీనారాయణకు పాటి సొన్నాపురం గ్రామస్తులు అండగా నిలిచారు. కవిటి చేరుకున్న పాటి సొన్నాపురం యువకులు తమ గ్రామం తరుపున లక్ష్మీనారాయణకు రూ.20 వేలు శనివారం అందించారు. అలాగే పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా కవిటికొత్తూరు జనసైనికులు లక్ష్మీనారాయణకు రూ.5,500లు అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ఆరింగి మధు, పాండవ శేఖర్, అగ్నికులా క్షత్రియ సంఘం నాయుడు పొల్లాయి లక్ష్మణమూర్తి, పొల్లాయి ఉమామహేశ్వరరావు, సింహాచలం, పొల్లాయి మోరేసు రుద్రయ్య, పొల్లాయి అశోక్, దేవరాజు, రుద్రయ్య, భాస్కరరావు, దుర్యోధన పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రమేష్‌బాబు

మహిళల భద్రతపై అవగాహన

టెక్కలి రూరల్ : మహిళల భద్రత కోసం స్ఫూర్తి కళాబృదం ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. స్థానిక విశ్వజ్యోతి, మథర్ థెరిసా జూనియర్ కళాశాలల్లో శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చైతన్యపరుస్తున్న గుడ్ టచ్-బ్యాడ్ టచ్, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, సెల్‌ఫోన్, సోషల్ మీడియాకు అలవాటు పడడం వల్ల జరిగే అనర్థాలు వంటి అంశాలపై నాటికలు ప్రదర్శించిన స్ఫూర్తి టీమ్ ద్వారా విద్యార్థులను చైతన్యపరుస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో స్ఫూర్తి టీమ్ సభ్యులు మజ్జి బాబూరావు, ప్రసాద్, స్వప్న, ప్రభావతి పాల్గొన్నారు.

విశ్రాంత సైనికోద్యోగికి స్వాగతం



స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

పలాస : ఎన్నో త్యాగాలు.... దేశం కోసం మరెన్నో సాహస ఘట్టాలు... కుటుంబాన్ని వదిలి సైన్యంలో దేశ రక్షకునిగా సేవలందించి ఉద్యోగ విరమణ పొంది స్వగ్రామానికి వచ్చిన విశ్రాంత సైనిక ఉద్యోగికి ఉద్దానం జేజేలు పలికింది. ఈ అపూర్వ ఘట్టానికి మండలంలోని బడ్డపాడు గ్రామం వేదిక అయింది. మండలంలోని బొడ్డపాడుకు చెందిన పోతనపల్లి ఢిల్లీరావు దేశ సైన్యంలో చేశారు. 20 ఏళ్ల పాటు విధులు నిర్వర్తించారు. ఆగస్టు నెలలో అండమాన్‌లో సైనిక ఉద్యోగ విరమణ పొందారు. శనివారం స్వగ్రామానికి రావడంతో గ్రామస్తులు రైల్వేస్టేషన్ నుంచి బొడ్డపాడు వరకు ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో సామాజిక వేత్త కిక్కర ఢిల్లీరావు, బొడ్డు మోహనరావు, టిడిపి తెలుగు యువత మండల అధ్యక్షుడు కిక్క ఢిల్లీరావు, బొడ్డపాడు సైనిక సంఘం అధ్యక్షులు రామారావు, బొడ్డపాడు పెద్దలు తమాడ త్రిలోచనరావు, క్రాంతి, బాలకృష్ణ, రథరథరావు, గంగయ్య పాల్గొన్నారు.

తాగునీటి కుళాయి ప్రారంభం

ప్రజాశక్తి- లావేరు

ప్రజా సంక్షేమమే వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. మండలంలోని పెద్దకొత్తకోట, కొత్తకుంకం గ్రామాల్లో జలజీవన్ మిషన్ పథకంలో రూ.75 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఇంటింటా తాగునీటి కుళాయిలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి లుట్ట అమ్మాజమ్మ, మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, మాజీ ఎంపిపి డి.రాజినాయుడు, జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి లుకాలపు శ్రీనివాసరావు, బురాడ చిన్నారావు, దేశెట్టి తిరుపతిరావు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

జిగురు పూసిన అట్టలు సిద్ధం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ఉపయోగించి పంటలను సాగు చేసుకోవడం వల్ల రైతులకు మేలు కలుగుతుందని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవి తెలిపారు. మండలంలోని నిమ్మతొర్లివాడలో వరి పంటలో కాంపాక్ట్ బ్లాక్‌లో పెట్టుకోడానికి జిగురున్న పసుపు అట్టలను సిద్ధం చేసి శనివారం రైతులకు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరి పంటలో రాజీలేని సూత్రాలలో భాగంగా జిగురు పూసిన అట్టలను రైతులకు అందజేసి వీటి ఉపయోగాలను వివరించామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకతి వ్యవసాయ సిబ్బంది తిరుపతిరావు, లక్ష్మి, కృష్ణవేణి, జానకిరామ్ పాల్గొన్నారు.

బీమాను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- నందిగాం

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు విధిగా జనరల్ ఇన్సూరెన్స్ బీమాను వినియోగించుకోవాలని ఎపిజివిబి రీజనల్ మేనేజర్ ఎల్.అనంతరావు అన్నారు. స్థానిక ఎపిజివిబి ఆవరణలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన డిక్కల గణపతిరావు భార్య కాసులమ్మకు రూ. 20 లక్షల బీమాను చెక్కును శనివారం అందించారు. ఈ సందర్భంగా జెసిఎస్ కన్వీనర్ జె.జయరాం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు చైతన్యం పెంచుకుని ఈ బీమాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నోడల్ అధికారి జి.రాము మాట్లాడుతూ 18 ఏళ్ల నుంచి 65 ఏళ్లలోపు వారు ఏడాదికి రూ.వెయ్యి చెల్లించి ఇన్స్యూరెన్స్‌ను పొందాలన్నారు. కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ జి.సురేష్‌కుమార్, జిటిఐడి జె.రాంబాబు, బ్యాంకు మేనేజర్ కిషోర్ పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న 'వరం' కుటుంబ సభ్యులు

ఘనంగా 'వరం' వర్ధంతి

శ్రీకాకుళం అర్బన్ : మున్సిపల్ మాజీ చైర్మన్ అంధవరపు వరం మూడో వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు, వరం ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన శనివారం వివిధ ప్రాంతాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత స్థానిక ఏడు రోడ్ల కూడలి, కళింగ వైశ్య కళ్యాణ మండపం వద్ద ఉన్న వరం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. స్థానిక మారుతి థియేటర్ వద్ద రూ.2 లక్షలు విలువ చేసే తోపుడు బళ్లను 15 మందికి పంపిణీ చేశారు. రిమ్స్ అన్నపూర్ణ సేవా సంస్థలో నిత్య అన్నదానానికి రూ.25 వేలు విరాళం అందజేశారు. కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, కళింగ వైశ్య రాష్ట్ర అధ్యక్షులు కోణార్క్ శ్రీను, వరం కుమార్తె, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి, ఊన్న నాగరాజు, అంధవరపు రఘురాం, బోయిన గోవిందరాజులు, కోరాడ రమేష్ పాల్గొన్నారు.

మండల రిసోర్స్ కో-ఆర్డినేటర్ల నియామకం

పొందూరు : మండలం గ్రామీణ నీటి సరఫరా విభాగం మండల రిసోర్స్ కో-ఆర్డినేటర్‌గా చోళ్ల శ్రీనివాసరావు నియమితులైనట్లు ఎంపిడిఒ సీపాన హరిహరరావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి వచ్చిన ఆర్డర్ కాపీని ఎంపిడిఒకు అందజేసి విధుల్లో చేరారు. గతంలో సాక్షరభారత్ మండల కో-ఆర్డినేటర్‌గా విధులు నిర్వహించగా, అప్పట్లో వారిని తొలగించారని, వాటి స్థానంలో ఈ పోస్టులను ఎంపిక చేసినట్లు శ్రీనివాసరావు పేర్కొన్నారు. కొత్తగా విధులు కేటాయించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.



వినతిపత్రం అందజేస్తున్న లక్ష్మునాయుడు

లావేరు : గ్రామీణ నీటి సరఫరా విభాగం మండల రిసోర్స్ కో-ఆర్డినేటర్‌గా పొట్నూరు లక్ష్మునాయుడు నియమకమయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి విడుదలైన ఉత్తర్వులు తీసుకుని ఎంపిడిఒ కుప్పలి సురేసుకుమార్‌కు శనివారం అందజేసి విధులను చేపట్టారు. ముందుగా మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడులను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.



పోస్టర్లను అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి- పోలాకి

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అనానరు. మండలంలోని గంగివలస, మౌగిల్లిపేట గ్రామాల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించి పోస్టర్లను అందజేశారు. అలాగే తాగునీటి కుళాయిలను ప్రారంభించారు. వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా ఈదులవలస, సుసరాం గ్రామాల్లోని వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయిడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, ఎఎంసి చైర్మన్ దుంపల భాస్కరరావు, సర్పంచ్ బంకా చక్రధర్, ఎంపిడిఒ ఉషశ్రీ, డిటి శ్రీనివాసరావు, ఎపిఎం రాజారావు పాల్గొన్నారు.

'నాడు-నేడు'తో పాఠశాలల అభివృద్ధి

ప్రజాశక్తి- నందిగాం

నాడు-నేడు పథకంలో భాగంగా అన్ని పాఠశాలలు కొత్త అందాలను సంతరించుకున్నాయని కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. మండలంలోని పోతులూరు ప్రాథమిక పాఠశాలను ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తితో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలు అవుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు రాజును అడిగి తెలుసుకున్నారు. నాడు-నేడు పథకంలో భాగంగా అన్ని పాఠశాలలో అభివృద్ధి చేసి ముఖ్యమంత్రి జగన్ చరిత్ర సృష్టించారని అన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, సర్పంచ్‌లు తమిరి రాజు, వైసిపి నాయకులు బొమ్మాళి గున్నయ్య , సంభాన దానయ్య, కవిటీ ఎర్రన్న, తమిరి దేవేంద్రరావు, తమరి బలరాం, లోళ్ళ వైకుంఠరావు, ఎంపిటిసి తిరుపతిరావు పాల్గొన్నారు.



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

సరస్వతిదేవి విగ్రహావిష్కరణ

పొందూరు : మండలంలోని మజ్జిలిపేట ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణంలో గ్రామానికి చెందిన గురుగుబెల్లి విష్ణుమూర్తి దంపతులు సరస్వతిదేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి ప్రోత్సాహం అందించిన విగ్రహ దాత విష్ణుమూర్తి దంపతులను ఎంఇఒ -1, 2లు పి.వి.రామరాజు, పట్నాన రాజారావు అభినందించారు. అనంతరం ఎంఇఒలను, ప్రధానోపాధ్యాయులు వి.వి.సత్యనారాయణను, ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. సర్పంచ్ ప్రతినిధి గురుగుబెల్లి అసిరినాయుడు, విశ్రాంత ఎంఇఒ గురుగుబెల్లి వేణుగోపాలరావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు గురుగుబెల్లి సన్యాసిరావు, న్యాయవాది పైడి సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు

ఇచ్ఛాపురం : మండలంలోని బెల్లుపడలో శ్రీకాకుళం మెడీకవర్ సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు శనివారం ప్రారంభం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి పాల్గొన్న వైద్యం చేసుకున్న వారికి మందులు పంపిణీ చేశారు. ఈ మేరకు 200 మందికి వైద్య పరికరాలు అందజేశారు. సీడాప్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావు, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి నారాయనమ్మ, ఢిల్లీ పాల్గొన్నారు.